www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 ఏప్రిల్ 2024

8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి

దెందులూరు సభలో మాట్లాడుతున్న షర్మిల

ఎక్కడ చూసినా దోపిడీ

కోడిపందేలు ఆడుతూ.. ఆడిస్తారు

కొల్లేరులో చెరువులన్నీ కబ్జా

దెందులూరు ఎంఎల్ఎపై షర్మిల ఫైర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్, చింతలపూడి

'దెందులూరు ఎంఎల్ఎ పేకాట, కోడిపందేలు ఆడుతూ.. ఆడిస్తున్నారటగా.. ఆయన వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా అన్నట్లుగా ఉంది. నియోజకవర్గంలో మట్టి మొత్తం దోచేశారు. కొల్లేరులో చెరువులన్నీ కబ్జా చేశారు. కొల్లేరు సమస్యను పట్టించుకోలేదు. రాష్ట్రంలో వైఎస్.జగన్ ప్రభుత్వం కూడా అంతే. ఎందుకు ఇలాంటి నేతలను, ప్రభుత్వాలను ఎన్నుకోవాలి' అని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి ప్రజలను ప్రశ్నించారు. శుక్రవారం ఆమె చింతలపూడి, దెందులూరు నియోజకవర్గం సోమవరప్పాడులో నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడారు. పోలవరం నిర్మించి ఉంటే దెందులూరు నియోజక వర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరు వచ్చేదన్నారు. పోలవరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన జగన్ చివరికి మనం కట్టే ప్రాజెక్ట్ కాదని చేతులెత్తేశాడన్నారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ప్రాజెక్ట్‌ను ఎందుకు పట్టించుకోలేదని ఆమె ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ పోలవరం నిర్మాణంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పోలవరం పూర్తి చేస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే ఎన్నో పరిశ్రమలు వచ్చేవన్నారు. బాబు, జగన్ ఇద్దరూ బిజెపికి గులాం గిరి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే ఉంటుందన్నారు. అప్పు లేని రైతు రాష్ట్రంలో లేడనీ, ఎక్కడ చూసినా ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం, ఇసుక, ల్యాండ్ మాఫియాలే దర్శనమిస్తున్నాయని, ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఎక్కడా కానరావడం లేదని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని మద్యం పేర్లు ఇక్కడే ఉన్నాయన్నారు. దెందులూరు ఇండియా వేదిక అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తిని, ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను గెలిపించాలన్నారు. సభలో కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, ఏలూరు సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, చింతలపూడి అభ్యర్థి ఎలిజా, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నేతలు డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి సభలో షర్మిలతోపాటు ఎంఎల్ఎ, కాంగ్రెస్ అభ్యర్థి ఎలిజా మాట్లాడారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, నేతలు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విమర్శలే ఎజెండా..

సమస్యలు పక్కదారి..!



ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల తీరు

ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేందుకు వ్యూహం

తాగునీరు, పోలవరం నిర్వాసితులు, కొల్లేరు, రోడ్లు వంటి సమస్యలపై మాట్లాడని పరిస్థితి

డబ్బు పంపిణీతో గెలిచేందుకు నాయకుల యత్నం

ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకుల నోట ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండాపోయింది. టిడిపి, జనసేన నాయకులు జగన్‌ను, వైసిపి నాయకులు, అభ్యర్థులు చంద్రబాబును తిట్టడంతోనే సరిపెడుతున్న పరిస్థితి నెలకొంది. దశాబ్దకాలానికిపైగా జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధాన పార్టీ అభ్యర్థులు ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. ఓటర్లను ఏమార్చి డబ్బు వెదజల్లి గెలవాలనే లక్ష్యంతోనే వారంతా ముందుకు సాగుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతంలో దాదాపు 30 మండలాల్లో తాగునీటి కోసం జనం అల్లాడిపోతున్నారు. ఆక్వా చెరువులతో తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. దీంతో కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. 2014లో తాము అధికారంలోకి వస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన టిడిపి ఐదేళ్ల పాలనలో పట్టించుకోలేదు. 2019 ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన వైసిపి ఐదేళ్లలో ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. దశాబ్దకాలం నుంచి జిల్లా ప్రజానీకం తాగునీటి కోసం నానావస్థలు పడుతున్నారు. అలాంటి పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నప్పటికీ తాగునీటి సమస్యపై జిల్లాకు వచ్చిన ఆ పార్టీ అధినాయకులుగాని, అభ్యర్థులుగాని మాట్లాడటం లేదు. ఎంతసేపు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతోనే సరిపెడుతున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య సైతం దశాబ్దన్నర కాలంగా సాగుతోంది. కాఫర్ డ్యామ్ నిర్మించి నిర్వాసితులను ముంచేసేరే తప్ప నిర్వాసితులకు మాత్రం పరిహారం ఇవ్వడం లేదు. తాము అధికారంలోకి వస్తే నిర్వాసితుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన టిడిపి, వైసిపిలు తమ పాలనలో మొండిచెయ్యి చూపాయి. జిల్లాలో దాదాపు 20 వేలకుపైగా నిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల్లో నిర్వాసితుల సమస్యపై ఏఒక్కరూ మాట్లాడటం లేదు. కొల్లేరు సమస్య పరిస్థితీ అలానే ఉంది. ఐదు లక్షల జనాభాకు సంబంధించిన సమస్యపై ఏఒక్కరూ మాట్లాడటం లేదు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని టిడిపి, వైసిపిలు అనేక హామీలు ఇచ్చాయి. తమ పాలనా కాలంలో మాత్రం పట్టించుకున్న దాఖలాల్లేవు. కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపు, సముద్రపు నీరులోనికి రాకుండా రెగ్యులేటర్ల నిర్మాణం, జిరాయతీ భూములను బాధితులకు ..6లో

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- రెండు జిల్లాల్లో మొత్తం 59 నామినేషన్లు తిరస్కరణ
- ఏలూరు జిల్లాలో ఎంపీకి 4, ఎంఎల్ఎ స్థానాల్లో 26 తిరస్కరణ
- పశ్చిమలో ఎంపీకి 6, అసెంబ్లీ స్థానాల్లో 23 రిజెక్టు
- 29 వరకూ కొనసాగనున్న విత్‌డ్రాల పర్వం

మాట్లాడుతున్న ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 సాధారణ ఎన్నికల నామినేషన్ల పరిశీలన, తిరస్కరణల పర్వం శుక్రవారం ముగిసింది. రెండు జిల్లాల్లో రెండు ఎంపీ, 14 ఎంఎల్ఎ స్థానాలకు మొత్తం 59 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం సెలవురోజు మినహా ఏడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ సాగింది. నరసాపురం ఎంపీ స్థానానికి మొత్తం 27 మంది నామినేషన్లు వేయగా పరిశీలనలో ఆరు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇక 21 నామినేషన్లు మిగిలాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో పరిశీలనలో 23 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఇంకా 99 నామినేషన్లు మిగిలాయి. ఏలూరు జిల్లాలో ఏలూరు ఎంపీ స్థానానికి 17 మంది ..6లో

సమస్యల సహవాసం.. ఉంగుటూరు నియోజవకవర్గం

మధ్యపేజీల్లో..

సేవా'లక్ష' ఆంక్షలు..!

గోనె సంచులు ఇవ్వాలని ఆర్‌బికె వద్ద ఆందోళన

8లో..

చేపలవేట చూద్దామని వెళ్లి..

స్నానానికి ఎర్రకాల్వలో దిగి ముగ్గురు మృతి

ఎర్రకాల్వ ఒడ్డున మృతదేహాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెంటౌన్

సరదాగా చేపల వేట చూసేందుకని బయల్దేరారు. అక్కడితో ఆగకుండా వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు స్నానం చేయాలని కాల్వలోకి దిగారు. అయితే అనూహ్యంగా గుంతలో చిక్కుకుని నీట మునిగి విగత జీవులయ్యారు. ఈ విషాదకర ఘటన మండలంలోని వేగవరం శివార్లలో ఎర్రకాల్వ వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం దిబ్బగూడేనికి చెందిన షేక్ మౌలాలి ఇంటికి తన భార్య షేక్ మహిషాద్(24)కు వరుసకు అక్క అయ్యే రేష్మ (25), తమ్ముడు అశ్వరావుపేట మండలం ఒట్లపల్లికి చెందిన ఆషాద్ (14) వచ్చారు. కూలి పనులు చేసుకునే మౌలాలి అప్పుడప్పుడు ఎర్రకాల్వలో చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. అలాగే శుక్రవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు మౌలాలి బయల్దేరాడు. అయితే తనకు ఫిషింగ్ అంటే ఇష్టమని, తానూ వస్తానని రేష్మ అనడంతో వారితోపాటు ఆషాద్, మహిషాద్ కూడా బయల్దేరారు. మౌలాలి తెప్పపై చేపలు పట్టేందుకు ఎర్రకాల్వలోకి వెళ్లగా ఈ ముగ్గురు స్నానం చేసేందుకు కాల్వలోకి దిగారు. ఆ ప్రాంతంపై అవగాహన లేకపోవడంతో పక్కనే ఉన్న గుంతలో వీరు పడిపోయారు. వీరి కేకలు విని మౌలాలి అక్కడకు చేరుకుని రక్షించే ప్రయత్నం చేసి ఫలించలేదు. మౌలాలి అరుపులకు ..6లో

కొయ్యలగూడెంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలంలో శుక్రవారం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కొన్ని గ్రామాల్లో వేడి గాలులు అధికంగా వీస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. కన్నాపురం వంటి కొండ ప్రాంతాల్లో వేడి అత్యధికంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి మూడుగంటలకోసారి కొబ్బరి నీరు, మజ్జిగ తదితర శీతల పానీయాలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప పది దాటిన తర్వాత బయటకు రావొద్దని, వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక రంగానికి చెందిన కూలీలు అతి జాగ్రత్తగా ఉండాలని అధికారి యంత్రాంగం అప్రమత్తం చేస్తున్నారు.

సురక్ష ఆసుపత్రిలో ఉచిత స్కానింగ్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండల కేంద్రంలో కన్నాపురం రోడ్ అపోలో స్కూల్ ఎదురుగా ఉన్న సురక్ష హాస్పిటల్‌లో ప్రతి నెల మొదటి బుధవారం గర్భిణులకు స్కానింగ్, ఒపి ఉచితంగా చూస్తామని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తెలిపింది. 24 గంటలు ఎమర్జెన్సీ కేర్, ల్యాబ్, స్కానింగ్ సదుపాయంతో అత్యాధునికమైన వైద్యం అందుబాటులో ఉంటుందని హాస్పిటల్ ప్రధాన వైద్యులు దిలీప్‌కుమార్ తెలిపారు. గైనకాలజీ, పిడియాట్రిక్స్ వంటి సమస్యలు అప్‌ల్యాండ్ ఏరియాలోనే అతి తక్కువ రుసుముతో, ఐసియు, ఎన్ఐసియు, ఇసిజి వంటి సేవలు కల్పిస్తున్నామన్నారు.

కోడె నాగతాచు సంచారం

పట్టుకున్న స్నేక్‌స్నాచర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న కోళ్ల ఫారం సమీపంలోని ఇళ్ల వద్ద కోడె నాగ తాచు వచ్చింది. ఆ పామును చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వారు స్నేక్ స్నాచర్‌కు సమచారం అందించారు. స్నేక్ స్నాచర్ వచ్చి శతవిధాలా ప్రయత్నించి ఆ పామును పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పాము తొమ్మిది అడుగుల పొడవు ఉందని, అత్యంత విషపూరితమైన పాము అని స్నేక్ స్నాచర్ తెలిపారు. ఆ పామును అడవిలో వదిలేస్తామని తెలిపారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చేది టిడిపి కూటమి ప్రభుత్వమేనని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి అన్నారు. మండలం బత్తులవారిగూడెం, యనమదల, సుంకొల్లు గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. అన్ని రంగాలు కుదేలైపోయాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు ఆలోచించి టిడిపి కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముసునూరు సగర కాలనీకి చెందిన (బిసి) సగరులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరి టిడిపి మాజీ వార్డు సభ్యులు గారపాటి నరసింహారావు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని భువనపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసిపి నేతలు సంకు శ్రీనివాసరావు, అలుమోలు శ్రీనివాసరావు, అలుమోలు రాంబాబు, అలుమోలు చిన్న, అలుమోలు గంగరాజు, అలుమోలు ధర్మారావు, ఆళ్ల రాంబాబు, ఆళ్ల గోపీతో పాటు మరికొంతమంది నేతలు జనసేనలో చేరారు. జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ సమన్వయ కర్త వట్టి పవన్ ఆధ్వర్యంలో వారు జనసేనలో చేరారు.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తే వారు మరిన్ని విజయాలను సాధిస్తారని ఎస్‌పి మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు నగరంలోని సురేష్ బహుగుణ పాఠశాలలో చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి మేరీ ప్రశాంతి పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించామని తెలిపారు. ఇందులో మొదటిగా కె.జోష్న 584 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. ఆమెకు ప్రశంసాపత్రంతో పాటు రూ.ఐదు వేల నగదు బహుమతిని అందించారు. అలాగే మరో ఏడుగురు విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులు విజయం సాధించినప్పుడు వారిని అభినందిస్తూ ప్రోత్సహిస్తే వారు మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల ఆశలను విద్యార్థులు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎఆర్ ఆర్ పవన్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, ఆర్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మేడే కార్యక్రమం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

138వ మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ ముద్రించిన కరపత్రాలను స్థానిక మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు, కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడి ఫాసిస్టు ధోరణులకు, మతోన్మాద విధానానికి వ్యతిరేకంగా భారతదేశ వ్యాప్తంగా మే ఒకటో తేదీన జరిగే 138వ మేడే కార్యక్రమాలను కార్మిక అడ్డాల్లో జెండాలు ఎగరవేసుకొని మీటింగులను, సభలను, జరుపుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాలను పరిరక్షించాలని, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమాలకు సన్నద్ధం కావాలని, అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ప్రాణాలర్పించి సాధించుకున్న లేబర్ కోడ్‌లను హరించే మోడీషా విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రమణ, మంగరాజు రాము, పల్లి గంగరాజు, విజయ్, మీసాల రమణ, కోరాడ అప్పారావు పాల్గొన్నారు.

టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రస్తుతం వైసిపి నెలకొల్పుతోన్న విష రాజకీయ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చి, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన చేయడం టిడిపితోనే సాధ్యమని టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలెప్పుడో కౌంట్‌డౌన్ స్టార్ట్ చేసేశారన్నారు. ఏలూరులో పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజల వద్దకే పాలన అనే నినాదం తీసుకొచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని అన్నారు. ఆ దిశగా పార్టీ ఆశయాలను, పార్టీ అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ముందుకెళ్తున్నానని చెప్పారు. ఏలూరులోని ఎఎస్ఆర్ గ్రౌండ్, జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లలో వాకర్స్‌ను, ఎఎస్ఆర్ గ్రౌండ్ వెనుక ఉన్న స్విమ్మింగ్‌ఫూల్ వద్ద ఉన్న వారిని బడేటి చంటి కలుసుకున్నారు. టిడిపి కూటమి అధికారంలోకొస్తే అమలు


ప్రజా సంకల్ప యాత్రలో బడేటి చంటి

చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ఫ్యాక్షనిజం పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు ప్రజా చైతన్యం ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా విస్తృతంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రోషన్‌కుమార్‌పై అసత్య ప్రచారాలు తగవు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్‌పై వైసిపి నాయకుల అసత్య ప్రచారాలు తగవని టిడిపి జంగారెడ్డిగూడెం మండల ప్రెసిడెంట్ సాయల సత్యనారాయణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోషన్‌కుమార్‌కు వస్తున్న ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి నాయకులు సోషల్ మీడియాలో లేనిపోని అసత్యప్రచారాల చేస్తున్నారన్నారు. ఆయనకు ఉన్న ప్రజల మద్దతును పూర్తిగా దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఇటువంటి కక్షపూరిత చర్యలకు వైసిపి నాయకులు పాల్పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసిన వైసిపి నాయకులు అది జీర్ణించుకోలేక బురద జల్లుతున్నారన్నారు. రోషన్‌కుమార్ నామినేషన్‌పై లేనిపోనివి సృషించి కక్షగట్టి అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. శుక్రవారం రోషన్‌కుమార్ నామినేషన్‌ను ఆమోదించారని తెలిపారు.

వైసిపి అభ్యర్థులను గెలిపించండి

ప్రచారంలో ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు చిన కోడలు దూలం స్వాతి కోరారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ముదినేపల్లి శివారు అన్నవరంలో ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ముదినేపల్లి పంచాయతీ పరిధిలో వైసిపి శ్రేణులతో కలిసి పర్యటిస్తూ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావులు పోటీ చేస్తున్నారన్నారు. వారిరువురికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి విజయం చేకూర్చాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రంలో ఎంపిపి రామ్‌శెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, ఆర్.రాధ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ భిక్షాలు, బేతపూడి వెంకటరమణ, కె.నాని, పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10 నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 25 వరకు సాగిన నామినేషన్ ప్రక్రియలో పోలవరం నియోజకవర్గానికి సంబంధించి 34 నామినేషన్లు 23 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయగా శుక్రవారం నామినేషన్ల పరిశీలనలో భాగంగా పోలవరం నియోజకవర్గంలో పది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 13 నామినేషన్లు ఆమోదం పొందాయి.

పలు గ్రామాల్లో కంభం విజయరాజు ప్రచారం

ప్రజాశక్తి - కామవరపుకోట

వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు కామవరపుకోట మండలం తాడిచార్ల, వడ్లపల్లి, ఆడమిల్లి, తడికలపూడి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల, గ్రామ నాయకులను కలుపుకుని ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. తాడిచార్ల గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో కొంచెం సేపు మాట్లాడారు. వారికి ప్రభుత్వం నుంచి పథకాలన్ని వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడమిల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి కొఠారు అబ్బాయ్యచౌదరి అటుగా వెళ్తూ కంభం విజయరాజును ఎన్నికల ప్రచారంలో ఆయన కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్‌బాబు, మేడూరి రంగబాబు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 28వ తేదీ ఆదివారం ఏలూరు ఒకటో పట్టణంలోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల వద్ద చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 28వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని అగ్రహారం, న్యూ మార్కెట్ ఏరియా, తూర్పువీధి, మెయిన్ బజార్, టీచర్స్ కాలనీ, వెన్నవల్లివారిపేట, నవాబ్‌పేట, సత్యనారాయణ పేట, లంబాడి పేట, బెనర్జిపేట, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు స్పోర్ట్స్ :వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు జ్యూట్‌మిల్లు సమీపంలో కొత్తూరు వంతెన కింది భాగంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. శుక్రవారం అటుగా వెళ్తు న్న స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజనాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి రూరల్ ఎస్ఐ రాజారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

పేరు మార్పు

గూడూరి రామ వెంకట సత్యనారాయణ, తండ్రి : గూడూరి రామస్వామి, నివాసం, డోర్ నెం.4-7, తాళ్ళపాలెం, దేవ, పెనుగొండ మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్ర-534123, అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు **గూడూరి సత్యనారాయణ (కుమారుడు శ్రీనివాస్ పాస్‌పోర్టు ప్రకారం) నుండి గూడూరి రామ వెంకట సత్యనారాయణ (ఆధార్ ప్రకారం)** మార్చుకోవడమైనది. కావున భవిష్యత్తులో అన్ని వ్యవహారాలలో వ్యవహరించవలసినదిగా కోరుచున్నాను.

నేరాలు - ఘోరాలు

అగ్నిప్రమాదంలో వరికుప్పలు, మొక్కజొన్న పంట దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగడపల్లి పంచాయతీ వింజరం-వెంకటరెడ్డిగూడెం గ్రామాల మధ్యలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడున్నర ఎకరాలకు సంబంధించిన రెండు వరికుప్పలు, సుమారు 40 ఎకరాల చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు తెలిపారు. ఎండిన మొక్కజొన్న తుక్కును రైతులు తగలబెట్టడం వల్లే మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సంఘటన ప్రాంతాన్ని మండల వ్యవసాయాధికారి, సిబ్బంది పరిశీలించారు.

రూ.1.30 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో వ్యాన్‌లో వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.1.30 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. ఈ నగదు గుంటూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భార్య కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - వీరవాసరం

తన భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇరగవరం మండలం కత్తెవపాడుకు చెందిన పద్మావతి ఈ నెల 19వ తేదీన వీరవాసరం తన పుట్టింటికి వెళ్లింది. మళ్లీ తిరిగి 21వ తేదీన కత్తెవపాడు బయలుదేరింది. కాని ఆమె ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు అన్ని చోట్ల వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తాటిరామన్నగూడెం గ్రామానికి చెందిన పూసం చెంచులు, భార్య ముత్తమ్మ 25 ఏళ్లగా గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా ఇటీవల భర్త చెంచులు మద్యానికి బానిసై రోజు తాగి వచ్చి భార్యతో గొడవ పడుతున్నాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగా ఇంటికి రాగా భార్య మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన భర్త చెంచులు గీత కత్తితో భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చెంచులును అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాపర్ వైర్ల చోరీపై కేసు

టి.నరసాపురం :విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల, తిరుమలదేవిపేట గ్రామ శివారులోని రైతుల పొలాల్లో ఉన్న మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బొర్రంపాలెం ఎలక్ట్రికల్ ఎఇ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల ప్రచారం చేస్తున్న కానూరి బుజ్జి

నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి చేస్తానని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర్‌కృష్ణప్రసాద్ (బుజ్జి) అన్నారు. మండలంలోని చిట్టవరం, గొంది గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. తనను ఎంఎల్ఏగా గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలో నీటి సమస్య అధికంగా ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ కార్యక్రమంలో న్యాయవాది పోలిశెట్టి బాబ్జి, మల్లిపూడి శ్రీను, కె.అమర్, శ్రీధర్, ముస్కోడి సాల్మన్, కొప్పర్తి కృష్ణమూర్తి, గుబ్బల కృష్ణారావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలనను సాగనంపండి : రఘురామ

ప్రజాశక్తి - ఆకివీడు

బైక్‌పై ప్రచారం చేస్తున్న రఘురామరాజు

రాష్ట్రంలో రాక్షస పాలనను సాగనంపడానికి ప్రతిఒక్కరూ కలిసి రావాలని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మండలంలోని కొల్లేరు శివారు పెదకాపవరం, చినకాపవరం, అప్పారావుపేట, గుమ్ములూరు, తరటావ, కోళ్లపర్రు, రాజులపేట, కాలింగగూడెం చిన్నమిల్లిపాడు, సిద్ధాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యటనలో ఆయన మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తూ ప్రచారం చేశారు.

గ్రామాలను సస్యశ్యామలం చేస్తా

జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

వీరవాసరం : ఎన్నికల ప్రచారంలో అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి కూటమి అధికారంలోకొస్తే గ్రామాలను సస్యశ్యామలం చేస్తామని మాజీ ఎంఎల్ఎ, జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మండలంలోని నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, వెంకటతిప్ప, కోమటితిప్ప (నార్త్) గ్రామాల్లో అంజిబాబు శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం గ్రామాల్లోని మౌలిక సదుపాయాల కల్పనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంఎల్ఏగా తనను గెలిపిస్తే భీమవరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మండలాధ్యక్షులు రేవు వెంకన్న, కార్యదర్శి కౌరు పృథ్వీశంకర్, జనసేన మండలాధ్యక్ష, కార్యదర్శులు మోకా శ్రీను, కత్తుల నిలేంద్ర పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయం నాదే

వీరవాసరం :ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే తన విజయం ఖాయమని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని తలతాడితిప్ప, వడ్డిగూడెం, చింతలకోటిగరువు, తోకలపూడి, పంజావేమవరం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా తలతాడితిప్ప గ్రామంలో స్థానిక మహిళలు పలు సమస్యలను అంజిబాబు దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకొచ్చాక సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు, టిడిపి మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లగూడెంలో జనసేన అభ్యర్థి ధర్మరాజు ప్రచారం

కూలీల ఓట్లు అభ్యర్థిస్తున్న ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం గొల్లగూడెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి కూటమి అధికారంలోకస్తే అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, స్థానిక నాయకులు వేములపల్లి సుధీర్, రాజశేఖర్, సింగులూరి రామకృష్ణ, కడియాల రవిశంకర్, టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నరసాపురంలో 'మన కోసం మన నాయకర్'

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 21వ వార్డులో మన కోసం మన నాయకర్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకల సతీష్ ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఘంటా కృష్ణ, జక్కం శ్రీమన్నారాయణ, బందెల రవీంద్ర పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో బొమ్మిడి నాయకర్

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

ప్రచారంలో టిడిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ప్రచారం టిడిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు

మండలంలోని తాడ్వాయి గ్రామంలో టిడిపి ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమిని గెలిపించాలని, అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరంచారు. వైసిపి నాయకులు స్వార్ధ రాజకీయాలు చేస్తున్నారన్నారు.

రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తా

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

బస్తాలు మోస్తున్న శివరామరాజు

రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, తనను ఎంఎల్ఎ గా గెలిపిస్తే కనీస మద్దతు ధర కల్పించే వరకు తాను రైతుల పక్షాన పోరాడుతామని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని పాందువ్వ, ఉనుదుర్రు గ్రామాల్లో ఆయన శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రైతులతో మాట్లాడారు. తనను మరోసారి ఎంఎల్ఏగా గెలిపిస్తే రైతుల సమస్యలు పరిష్కరిస్తానని, ఉండిని ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

మాట తప్పిన, మడమ తిప్పిన జగన్

ప్రచారంలో ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి

తణుకురూరల్ :ఎన్నికల ముందు మాట తప్పను, మడమ తిప్పనని పదే పదే చెప్పిన జగన్ అధికారంలోకొచ్చాక హామీలను గాలికొదిలేశారని తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. అత్తిలి మండల కేంద్రంలో టిడిపి కూటమి తరపున ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. టిడిపి కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అత్తిలి మండలాధ్యక్షులు ఆనాల ఆదినారాయణ, సత్యనారాయణ, పోలిశెట్టి చంటి, పూతినీడి శ్రీనివాస్, మేడపాటి కృష్ణకుమారి, జనసేన నాయకులు దాసం ప్రసాద్, బడేటి త్రినాథ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రచారంలో ఆరిమిల్లి కృష్ణతులసి

జగన్నాథపురంలో వాసుబాబు ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం


ఎన్నికల ప్రచారంలో వాసుబాబు

వైసిపి ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) శుక్రవారం గణపవరం పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సవా'లక్ష' ఆంక్షలు..!

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లా వ్యాప్తంగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. నామినేషన్ ఘట్టం పూర్తయ్యింది. అభ్యర్థుల ప్రచార హోరు ఊపందుకుంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎవరు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా బ్యాంకుల లావాదేవీలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. వ్యక్తిగత ఖాతాల్లో రూ.లక్షకు మించి జరిగే ప్రతి నగదు లావాదేవీలను బ్యాంకుల్లో ఏ రోజు కారోజు ఇసికి అప్పగిస్తాయి.

ఎన్నికల వేళ బ్యాంకు లావాదేవీలపై పూర్తి నిఘా
ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్న ఎన్నికల సంఘం
రూ.లక్ష దాటితే ఆధారాలు ఉండాల్సిందే..
వివాహాది వేడుకల నేపథ్యంలో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో జరిగే నగదు లావాదేవీలు, నగదు రహిత లావాదేవీలను నిశ్చంతంగా పరిశీలించి వాటి వివరాలను జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందానికి అప్పగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివాహాలు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను తమ వద్ద ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి.

శుభకార్యాలకు తప్పని నగదు కష్టాలు..

జిల్లా వ్యాప్తంగా వివాహాలు, గృహ ప్రవేశాలు తదితర శుభకార్యాలు జోరుగా జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రజలు నగదు బదిలీలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే నగదు తీసుకునేందుకు బ్యాంకుల్లో ఎటువంటి నిబంధనలు లేవని, ఎంత నగదు అయినా తీసుకోవచ్చుని, వాటికి సంబంధించి ఆధారాలు ఉండాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు తీస్తే ఏ అవసరం కోసం తీసుకున్నారో వాటి ఆధారాలను సమర్పించాలని అధికారులు చెబుతున్నారు.

ప్రతి లావాదేవీ పై..

జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో జరిగే లావాదేవీలన్నింటినీ ఆయా బ్యాంకుల శాఖాధికారులు నిత్యం పరిశీలించి అనుమానాస్పద లావాదేవీల వివరాలను రూ.లక్ష దాటిన లావాదేవీల వివరాలను, అసాధారణ బ్యాంకు లావాదేవీలను గమనించి ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రత్యేక నివేదికలో పొందుపర్చి ఆయా బ్యాంకుల సిబ్బంది అధికారులకు సమర్పిస్తున్నారు.

అభ్యర్థులు వారి బంధువుల ఖాతాలను ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తోంది. ఇతరుల నగదు పార్టీల నేతలు నగదుకు ఎవరూ తమ వ్యక్తిగత ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహించొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. బినామీల రూపంలో ఎవరికీ ఖాతాలను లావాదేవీల కోసం అప్పగించరాదన్నారు. వ్యక్తిగత ఖాతాల్లో రూ.లక్ష, నగదు నేరుగా జమ చేయడం, నగదు తీసుకోవడం, జరిగితే వాటి వివరాలు ఎన్నికల సంఘం పరిశీలిస్తుంది. నగదు జమ తీసుకున్న వారు అవసరం మేరకు లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. గడిచిన ఆరు నెలల్లో బ్యాంకుల్లో నిర్వహించిన లావాదేవీలకు విరుద్ధంగా అసాధారణ లావాదేవీలు నిర్వహిస్తే వాటిని ఎన్నికల సంఘం అనుమానాస్పదంగా పరిగణిస్తుంది. నగదు రహిత లావాదేవీల్లో రూ.10 లక్షలు, ఆపైన బదిలీ అయిన వాటి వివరాలు అదే రోజు ఎన్నికల సంఘం ఆదాయపు పన్ను శాఖ అధికారుల వద్దకు చేరుతుంది. ఒక ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు జమ అవ్వడం వారి ఖాతాల నుంచి ఎక్కువ మంది ఖాతాలకు తక్కువ డబ్బు బదిలీ అయినా అనుమానాస్పదంగా పరిగణించి వారిని వివరణ కోరతారు.

లావాదేవీల వివరాలు సమర్పిస్తున్నాం..

రాజ్‌కుమార్, ఎస్‌బిఐ మేనేజర్, ఆచంట

జిల్లా వ్యాప్తంగా పట్టణ, పల్లెల్లోని బ్యాంకుల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. జిల్లా ఎన్నికల అధికారులకు ప్రతి రోజూ అనుమానాస్పద, అసాధారణ లావాదేవీలు వివరాలు సమర్పిస్తున్నాం. అధిక మొత్తంలో నగదు బదిలీ అయితే ఎన్నికల సంఘంతో పాటు ఆదాయపు పన్ను అధికారులకు వివరాలు వెళ్తాయి. ఆయా పార్టీల కార్యకర్తలు అత్యుత్సాహంతో ఇతరుల నగదును తమ ఖాతాలోకి లావాదేవీలు చేస్తే చర్యలు తప్పవు.

నరసాపురంలో.. నలుగురు నాయకర్లు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి 14 మంది 25 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో నాయకర్ పేరు కలిగిన వారు నలుగురు ఉన్నారు. నరసాపురం జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో పాటు జాతీయ జనసేన తరపున అభ్యర్థిగా పాలెపు సత్యలింగ నాయకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపు అభ్యర్థిగా కొల్లి సత్యనాయకర్ నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు నాయకర్ సోదరుడు బొమ్మిడి సునీల్ నాయకర్ జనసేన తరపున నామినేషన్ దాఖలు చేశారు. పాలెపు సత్యనాయకర్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ. కొల్లి సత్యనాయకర్ స్వస్థలం నరసాపురం పట్టణంలోని 3వ వార్డు కావడం విశేషం. ఇప్పటికే నలుగురు ఒకే పేర్లు కలిగి ఉండడంతో పాటు కొందరి ఎన్నికల గుర్తులు కూడా ఒకేలా ఉన్నాయి. జనసేన అభ్యర్థి బొమ్మిడి నారాయణ నాయకర్ గాజు గ్లాస్ గుర్తుకు, జాతీయ జనసేన అభ్యర్థి పాలెపు సత్యనాయకర్ గుర్తు పెన్ స్టాండ్, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థి కొల్లి సత్యనాయకర్ గుర్తు బకెట్, బొమ్మిడి సునీల్ నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా గ్లాస్, స్టవ్, బాట్‌కు అభ్యర్థులు ఆయా గుర్తులను ప్రతిపాదించారు. శుక్రవారం స్క్రూట్నీలో ఈ నలుగురు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులు తిరస్కరించలేదు. ఆయా అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటారా లేక పోటీలో ఉంటారా అనేది నియోజకవర్గంలో పెద్ద స్థాయిలో చర్చ నడుస్తోంది.

ఆసక్తికరంగా కొడుకులు, కోడళ్ల ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పోరాటం ఆసక్తికరంగా, రసవత్తరంగా మారింది. ముఖ్యంగా ఇక్కడ ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున కొడుకులు, కోడళ్లు చేస్తున్న ఎన్నికల ప్రచారాలను ఆయా గ్రామాల్లో ఓటర్లు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టిడిపి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ పోటీ పడుతున్నారు. వీరిద్దరూ పోటాపోటీగా ఒకే రోజు, ఒకే ముహూర్తానికి నామినేషన్లు వేశారు. ఆ కార్యక్రమానికి ఇద్దరి మద్దతుదారులు వేలాదిగా తరలివచ్చారు. ప్రస్తుతం ప్రచారాలు కూడా పోటా పోటీగా సాగుతున్నాయి. శ్రీరంగనాథరాజు గెలుపు కోసం ఆయన కుమారుడు చెరుకువాడ నరసింహరాజు (నరేష్) పలు గ్రామాల్లో ప్రచారం చేస్తుండగా, పితాని సత్యనారాయణ విజయం ఆశిస్తూ ఆయన ఇద్దరు కొడుకులు పితాని వెంకట్, పితాని భానులతో పాటు, కోడళ్లు పితాని నాగ సాహిత్య, పితాని స్వాతి ప్రచారం చేస్తున్నారు. ఇరుపార్టీల మాజీ మంత్రులు, ప్రస్తుత అసెంబ్లీ అభ్యర్థుల ప్రచారం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఆసక్తికరంగా మారిందనే చెప్పాలి.

శ్రీరంగనాథ తనయుడు నరేష్ ప్రచారం

పితాని కోడలు నాగ సాహిత్య ప్రచారం

సార్వత్రిక సంగ్రామం

సమస్యల సహవాసం..
ఉంగుటూరు నియోజకవర్గం..

ప్రభుత్వాసుపత్రులను జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది అందరికీ సర్కారీ వైద్యం అందిస్తామనే ప్రభుత్వ వాగ్దానాలు వట్టి కలగానే మారాయి. బ్రిటీష్ కాలం నాడు ఏలూరు కాలువలపై కట్టిన వంతెనలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయోనని అనుక్షణం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ అడుగుకో గొయ్యి అనే చందంగా తయారయ్యాయి. నిర్వహణా లోపం కారణంగా రక్షిత తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టుల సహకారంతోనే నేటికీ పలు గ్రామాల్లో తాగునీటి పంపిణీ సాగుతోంది. ఇదీ స్థూలంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యల చిట్టా.

- కుంగుతున్న వంతెనలు..
- అందని వైద్యం.. అధ్వానంగా రోడ్లు
- పట్టని పాలకులు.. ప్రజల అవస్థలు

భీమడోలు రైల్వే స్టేషన్ ముఖద్వారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల్లో 81 గ్రామాల్లో సుమారు 2.80 లక్షలకుపైగా జనాభా, 2,05,334 మంది ఓటర్లు ఉన్నారు.

శిథిలావస్థలో నిడమర్రు మండలంలోని ఏకైక పిహెచ్‌సి

డెల్టా ప్రాంతానికి చెందిన నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం శిథిలావస్థ దశకు చేరి చాలాకాలమైంది. దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని శాసనసభలో ఎంఎల్‌ఎ వాసుబాబు ప్రస్తావించినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ మండలంలో 16 గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. పాడుబడిన పిహెచ్‌సిలో సౌకర్యాలు లేకపోవడంతో పేదలకు వైద్య సేవలు అందడం లేదు. పత్తేపురం - తోకలపల్లి ఆర్అండ్‌బి రోడ్డుతోపాటు అనేక రహదారులు అధ్వానంగా మారాయి.

దినదినగండంగా నారాయణపురం వంతెన

ఏలూరు కాలువపై నారాయణపురం, పూళ్ల, ఉంగుటూరు, గుండుగొలను వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. గుండుగొలను వద్ద పాత వంతెన కూలిపోవడంతో దాన్ని తొలగించి కొత్త వంతెన నిర్మాణ పనులు గతేడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. గణపవరం, భీమవరం వెళ్లేందుకు ప్రధానమైన నారాయణపురం వంతెన శ్లాబు పెచ్చులూడి ఒకపక్క ఖానా కొంతమేరకు కుంగింది. భీమవరం నుంచి జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, ఖమ్మం వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఈ వంతెన మీదుగానే ప్రయాణించాల్సి ఉంది. ఈ వంతెన నిర్మాణానికి రూ.8.5 కోట్లు నిధులు మంజూరైనా తదనంతరం పనులు ముందుకు సాగలేదు. నారాయణపురం బజారులో ఆక్రమణల కారణంగా రోడ్డు ఇరుగ్గా మారి తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరులో వంతెన 2014లో కూలిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ఇరుకు వంతెన కావడంతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ జామ్‌తో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం రోడ్డు గోతుల కారణంగా ఎంతోమంది ప్రమాదాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. రావులపర్రు- కాకర్లమూడి, రావులపర్రు - కోనాల రహదారులు బాగోలేదు. రావులపర్రు - ఉంగుటూరు దారిలో పత్తేపురం పంట కాలువ వంతెన కూలి ఆరేళ్లు దాటినా నేటికీ నిర్మించకపోవడంతో సుమారు ఆరేడు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తోకలపల్లి ప్రధాన మురుగు కాలువ రెగ్యులేటర్ గేటు షట్టర్లు తుప్పుబట్టి వర్షా కాలంలో నీటి నియంత్రణ చేయలేక పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. గణపవరం మండలంలో రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయి.

నారాయణపురం కాలువపై వంతెన

ఫోకస్

పేరు గొప్ప.. ఊరు దిబ్బ చందంగా భీమడోలు రైల్వే స్టేషన్

భీమడోలు రైల్వే స్టేషన్‌లో గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికులకు ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పూళ్ల కాలువ వంతెన ఇరుగ్గా ఉంది. తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. లంక గ్రామాల్లో తాగునీటి సమస్య తీరలేదు. భీమడోలు జంక్షన్‌లో జాతీయ రహదారి-ద్వారకాతిరుమల రోడ్డు అనుసంధాన మార్గం గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధింత యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

శిథిలావస్థ దశలో పెదనిండ్రకొలను పిహెచ్‌సి భవనం

నారాయణపురం వంతెన ఖానా కుంగిన ప్రాంతం

భీమడోలు రైల్వే స్టేషన్

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతతత్వంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, పొత్తు పార్టీలు టిడిపి, జనసేనను ఓడించాలని తెలిపారు. కాంగ్రెస్ ఉంగుటూరు అసెంబ్లీ అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజును, ఏలూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావూరు లావణ్యను గెలిపించాలని కోరారు. బావాయిపాలెం, క్రొవ్విడి, ఛానమిల్లి సిపిఎం బృందం సభ్యులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ క్యార్యక్రమంలో శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం బృందం సభ్యులు

నామినేషన్ల తిరస్కరణలు ఇలా..

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. వాటిలో 15 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు అర్హత పొందగా, 3 నామినేషన్లు తిరస్కరించబడ్డాయని ఆర్ఒ, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. నామినేషన్ ఉపసంహరించుకోదలచిన అభ్యర్థులు ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటల్లోపు రిటర్నింగ్ అధికారికి అందజేయాలని తెలిపారు. ఎంఎల్ఎ అభ్యర్థి రూ.40 లక్షలు మించి ఎన్నికల నిమిత్తం ఖర్చు పెట్టరాదన్నారు. అలాగే పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిమిత్తం ప్రత్యేకంగా తెరువబడిన బ్యాంకు అకౌంట్ ద్వారా మాత్రమే ఎన్నికలకు సబంధించిన జమ, ఖర్చులు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ వారి ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఒక వ్యక్తికి రూ.10 వేలు మాత్రమే నగదు రూపేణ చెల్లించాలన్నారు.

నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

తాడేపల్లిగూడెం:నియోజకవర్గ పరిధిలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ దాఖలైన వివిధ పార్టీల నామినేషన్లను శుక్రవారం ఎన్నికల పరిశీలకులు ఐఎఎస్ అధికారి ఎల్.నిర్మలరాజ్ పర్యవేక్షణలో ఆర్ఒ కె.చెన్నయ్య పరిశీలించారు. మొత్తం 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఏడుగురి అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించడం జరిగిందన్నారు. 13 మంది నామినేషన్లు ఆమోదించినట్లు చెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.మురళీకృష్ణ, డిప్యూటీ తహశీల్దారు ఎస్.శివశంకర్, సీనియర్ అసిస్టెంటు సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి : శుక్రవారం నామినేషన్లు పరిశీలించినట్లు ఆర్ఒ, జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. తహశీల్దార్ కార్యాలయ సమావేశం హాల్లో దాఖలైన నామినేషన్ల పత్రాలను ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎల్.నిర్మల్ రాజుతో కలిసి ఆర్ఒ, జెసి ప్రవీణ్‌ఆదిత్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థానానికి 21 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 17 మంది నామినేషన్లను ఆమోదించగా, ముగ్గురి నామినేషన్లు చెల్లుబాటు కాలేదని తెలిపారు. వారిలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీల ప్రధాన అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన కనుమూరి భరత్, పెనుమత్స గోపాలకృష్ణం రాజు, వేగేశ్న వెంకట రామరాజు నామినేషన్లు చెల్లుబాటు కాలేదని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఉప తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు:ఉంగుటూరు అసంబ్లీ నియోజకవర్గంలో 16 మంది అభ్యర్థుల నుంచి 24 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం స్క్రూట్నీలో ఒక అభ్యర్థికి చెందిన రెండు నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్ఒ ఖాజావలీ తెలిపారు. పుప్పాల ఆదివల్లి రమణి వైసిపి అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు భార్య కావడంతో ఆమె వేసిన నామినేషన్ తిరస్కరించారు. ఈ క్రమంలో 15 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. నామినేషన్ల విత్‌డ్రాలకు ఈ నెల 29వ లోపు గడువు ఉంది.

ఆచంట : నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఆచంట నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో చెరుకువాడ వెంకట నరసింహరాజు, పితాని వెంకట సురేష్ నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు.

తణుకురూరల్ : ఈ నెల 18వ తేదీ 25వ తేదీ వరకూ తణుకు నియోజకవర్గ అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ జరిగింది. 16 మంది అభ్యర్థులు నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ మేరకు శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బివి.రమణ విడుదల చేశారు. అలాగే యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ అభ్యర్థి కారుమూరి లక్ష్మీకిరణ్, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి కృష్ణతులసి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి దిర్శిపో వివి.రామకృష్ణ నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు.

పాలకొల్లు : అభ్యర్థుల నామినేషన్ పత్రాలు పరిశీలించినట్లు రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి తెలిపారు. పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ దాఖలైన వివిధ పార్టీల నామినేషన్లను శుక్రవారం సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.దీప (ఐఎఎస్) అధికారి పర్యవేక్షణలో పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 19 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో మూడు నామినేషన్లు తిరస్కరించబడినట్లు తెలిపారు. 16 ఆమోదించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో సహాయ ఆర్ఒలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.అద్దయ్య తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా, 9 మంది నామినేషన్ ఆమోదించినట్లు తెలిపారు. మూడు నామినేషన్ తిరస్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా, టిడిపి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, వైసిపి అభ్యర్థి కంభం విజయ రాజు, బిఎస్‌పి నుంచి చైతన్య, స్వతంత్ర అభ్యర్థులుగా వెంప దుర్గా, ఎస్తేరు రాణి, టి.శ్రీనివాసరావు, కె.ప్రసాద్, పి.ధర్మరాజు నామినేషన్లు ఆమోదించినట్లు తెలిపారు. నామినేషన్ విత్ డ్రా చేసుకోవడానికి 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ సమయం ఉందని తెలిపారు.

నరసాపురం : నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 14 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో రెండు తిరస్కరించినట్లు ఆర్ఒ, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. వైసిపి అభ్యర్థి ముదునూరి ప్రసాద్‌రాజు సతీమణి ముదునూరు శారదావాణి, స్వతంత్ర అభ్యర్థి లోకం శ్రీనివాస్ నామినేషన్‌ను తిరస్కరించారు.

ఇవి పాటించకుంటే జైలే..!

126 చట్టం : ఎన్నికల సమయానికి 48 గంటల సమయం ఉండగానే బహిరంగ సభలు, సమావేశాలు, ప్రచారం ముగించాలి. ఎన్నికల నిబంధనల మేరకు 48 గంటల సమయం ఉండగా సభలు వంటివి నిర్వహిస్తే శిక్షార్హులు. అందుకు రెండేళ్ల జైలు లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

127 చట్టం: ఎవరైనా తన పేరు, చిరునామా లేకుండా ఎన్నికల కర పత్రాలు, వాల్ పోస్టర్లు ముద్రిస్తే ఆరు నెలల జైలు, లేదా రెండు వేల రూపాయలు జరిమానా లేదా రెండూ అమలు చేయొచ్చు.

128 చట్టం : బహిరంగంగా ఓటేస్తే మూడు నెలలు జైలు లేదా జరిమానా, లేదా రెండూ విధిస్తారు.

130 చట్టం : పోలింగ్ బూత్‌కు వంద మీటర్లలోపల ప్రచారం చేయరాదు. ప్రచారం చేస్తే రూ.250 జరిమానా విధిస్తారు.

131 చట్టం : పోలింగ్ బూత్‌కు సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే సామగ్రిని స్వాధీనం చేసుకుంటారు. మూడ నెలలు జైలు లేదా జరిమానా లేదా రెండు శిక్షలు అమలు చేస్తారు.

133 చట్టం : ఓటర్లను పోలింగ్ బూత్‌ల వద్దకు చేరవేసేందుకు వాహనాలు సమకూరిస్తే శిక్షార్హులు.. మూడు నెలలు జైలు లేదా జరిమానా లేదా రెండూ విధిస్తారు.

134 చట్టం : ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం చేస్తే శిక్షార్హులు. రూ.500 వరకూ జరిమానా విధించవచ్చు.

అప్పుడు ఓటు కార్డులు లేవుగా..?

1995 ముందు ఓటరు కార్డులు లేవు. ప్రభుత్వ గ్రామ, మండల అధికారుల సహకారంతో అభ్యర్థులను గుర్తించి ఐడెంటిటీ స్లిప్‌లు, మంజూరు చేసే వారు. ఆ కార్డుల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే ఆ తర్వాత నకిలీ ఓట్లను గుర్తించేందుకు 1995లో ఓటరు గుర్తింపు కార్డును ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టింది. నకిలీ ఓట్లను గుర్తించేందుకు 2004లో ఇవిఎం యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఓటు ఎవరికి వేశామో చూసుకునేందుకు వీలుగా వివి ప్యాడ్‌లను అందుబాటులోకి తెచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి

జెసి లావణ్యవేణి

ఏలూరు:జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులుంటే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలను తెలిపారు. రైతులు 08812-230448, 7702003584, 7569562076, 7569597910 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లాలో నేటి వరకు 8,143 మంది రైతుల నుండి 207.31 కోట్ల రూపాయల విలువైన 1,05,638 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించి ఇప్పటివరకూ 15,575 మంది రైతులకు చెందిన 1,26,274 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు. రూ.87.68 కోట్లు జమ చేయడం జరిగిందని, మరో రూ.119.63 కోట్లు బ్యాంకు జమ చేసే ప్రక్రియలో ఉందని తెలిపారు.

టిడిపి కూటమికి బుద్ధి చెప్పండి

ముద్రగడ పద్మనాభం

ఉండి:కాపులను నమ్మించి నట్టేట ముంచిన టిడిపి కూటమికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం అన్నారు. శుక్రవారం ఉండి కోట్ల ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కాపు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముద్రగడ పద్మనాభం మాట్లాడారు. కాపులను చంద్రబాబు నాయుడు మోసం చేయగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టిడిపికి తన పార్టీని తాకట్టు పెట్టి కాపులను నట్టేట ముంచేశాడని విమర్శించారు. కాపు ఉద్యమ సమయంలో చంద్రబాబు నాయుడు తనను, తన కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టాడని, 14 రోజులు గృహ నిర్బంధంలో పెట్టినప్పుడు జనసేనాని పవన్ కళ్యాణ్ ఎక్కడున్నాడని ప్రశ్నించారు. వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్ నర్సింహరాజును, వైసిపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, వైసిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి పివిఎల్ నరసింహరాజు నేతలు పాల్గొన్నారు.

గూడెంలో బోలిశెట్టి ప్రచారం

తాడేపల్లిగూడెం:జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం పట్టణంలోని 34, 35 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇసుక, మట్టి అమ్ముకుంటూ ప్రజలు చెల్లించిన టాక్స్ కబ్జా చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రాబోతోందన్నారు. నా తండ్రి ఆర్‌టిసి డ్రైవర్ అని, ఓట్లు అడిగే స్థాయికి వచ్చామంటే ప్రజల భిక్షేనన్నారు.

మంచి జరిగితేనే ఓటేయండి : ప్రసాదరాజు

నరసాపురం:'మీ కుటుంబంలో మంచి జరిగింది అంటేనే ఓటు వేయాలని' రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పాత నవరసపురం గ్రామంలో 38వ రోజు ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ మే 13 జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలన్నారు.

మేడే విజయవంతం చేయాలి

మొగల్తూరు:మే డే దినోత్సవంలో కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జనరల్ బాడీ సమావేశం సంఘం అధ్యక్షురాలు జి.పెద్దింట్లు అధ్యక్షతన నిర్వహించారు. సుమారు 200 సంవత్సరాల క్రితం ఎన్నో పోరాటాలు చేస్తే కార్మిక చట్టాలు రూపొందాయన్నారు. ఆ చట్టాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం సవరించి నాలుగు కోడ్‌లు కింద మార్చడం దారుణమని అన్నారు. కార్యక్రమానికి కార్మిక, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జిల్లాకు విచ్చేసిన ఆరుగురు ఎన్నికల పరిశీలకులు

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులు జిల్లాకు విచ్చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఇప్పటికే సి-విజిల్, ఫిర్యాదులకు 1950, ఎన్‌జిఎస్ పోర్టల్, ఇఎస్ఎంఎస్, ఇతర ప్లాట్ ఫారమ్‌లను ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారానికి అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ప్రత్యక్ష పర్యవేక్షణకు జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకులను జిల్లాకు నియమించినట్లు తెలిపారు. ఎం.దీప ఐఎఎస్‌ను సాధారణ పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ల్యాండ్ లైన్ ఫోన్ నంబర్ 08816-299633, మొబైల్ నంబర్ 9182408687కు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అలాగే ఎల్.నిర్మలరాజ్ ఐఎఎస్ తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ల్యాండ్ లైన్ నంబరు 08816-299631, మొబైల్ నంబర్ 9182404268కు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పియూష్ శుక్లా, ఐఆర్ఎస్‌ను పార్లమెంట్ వ్యయ పరిశీలకులుగా నియమిం చినట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాలకూ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ల్యాండ్ లైన్ నంబర్ 08816-299632, మొబైల్ నంబర్ 9182406871కు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. శైలేష్ కుమార్ ఐపిఎస్‌ను పోలీస్ అబ్జర్వర్‌గా నియమించడం జరిగిందని అన్ని నియోజకవర్గాలకు ఎన్నికల పోలీస్ పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. 08816- 299636, 9182401630 నంబర్లకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మోహల్ అగర్వాల్, ఐఆర్ఎస్‌ను వ్యయ పరిశీలకులుగా నియమించారని, ఆచంట, పాలకొల్లు, నరసాపురం ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

08816-299634, 9182404116కు అందుబాటులో ఉంటారని తెలిపారు. విక్రమాదిత్య మీనా, ఐఆర్ఎస్‌ను వ్యయ పరిశీలకులుగా నియమించడం జరిగిందని, తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. 08816-299635, 9182404117 నంబర్లకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఏదైనా ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను, అర్జీలను రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, సాధారణ ప్రజలు భీమవరం సూర్య నారాయణ పురం తమ్మిరాజు నగర్ కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో పరిశీలకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పని దినాల్లో ప్రతి రోజూ ఉదయం10 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకూ స్వయంగా కలిసి అందజేయొచ్చని పేర్కొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయుల ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి పితాని సత్యనారాయణ విజయాన్ని ఆకాంక్షిస్తూ తనయులు పితాని భానుచందర్, పితాని వెంకట్ శుక్రవారం విస్తత ప్రచారం చేశారు. పెనుగొండలో భానుచందర్, ఆచంట మండలం భీమలాపురంలో పితాని వెంకట్ ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన అంతమొందించేందుకు టిడిపి, జనసేన, బిజెపి కూటమి జతకట్టాయన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం తథ్యమని పితాని సత్యనారాయణ తనయులు ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా వైసిపికి చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, పవన్ కళ్యాణ్ సంకల్పం, మోడీ అభివద్ధి కూటమి అభ్యర్థుల విజయానికి నాంది పలుకుతున్నాయన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. టిడిపి ఆచంట నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పితాని సత్యనారాయణ సైకిల్ గుర్తుకు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాసరావు వర్మ కమలం గుర్తుకు ఓటేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఓటర్లను అభ్యర్థించారు. పితాని సత్యనారాయణ హయాంలో రూ.2,500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. నియోజకవర్గంలో 98 శాతం సిమెంట్ రోడ్లు పూర్తి చేశారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కరించే పితాని సత్యనారాయణను గెలిపించాలని, అధికార మదం, ధన దాహంతో ఉన్న పాలకులను సాగనంపాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నెక్కంటి ప్రభాకర్ చౌదరి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీరాములు, వీరాస్వామి, నెక్కంటి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, బిజెపి అధ్యక్షులు ముచ్చర్ల సుబ్బారావు, జనసేన జవ్వాది బాలాజీ నాయుడు, టిడిపి పెనుగొండ మండల అధ్యక్షులు వెలిశెట్టి బాబు రాజేంద్రప్రసాద్, వేంద్ర రాము, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆచంటలో ప్రచారం చేస్తున్న పితాని తనయుడు వెంకట్

వడ్రంగి పనివారిని ఆదుకుంటాం : ఎంపీ అభ్యర్థి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వడ్రంగి పనివారిని అన్ని విధాలా ఆదుకుంటామని వైసిపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. స్థానిక ఎఎంసి ఎదురుగా ఉన్న వీరవల్లి సీతారామలక్ష్మి నగర్‌లో అభ్యుదయ కార్పెంటర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌తో పాటు ఎంపీ అభ్యర్థి ఉమాబాల హాజరయ్యారు. ముందుగా యూనియన్ నేతలు మాట్లాడారు. తాము పనిచేసే సమయంలో అనేక ప్రమాదాలకు గురవుతున్నామని, దీంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల తప్పకుండా రానున్న రోజుల్లో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జరగబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి తమను గెలిపించాలని కోరారు. అనంతరం ఉమాబాలను గ్రంధి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు తోట భోగయ్య, ఎఎంసి ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

ఉమాబాలను కలిసిన ముస్లిం నేతలు

భీమవరం 21వ వార్డు చిన మసీదుకు చెందిన ముస్లిం నాయకులు శుక్రవారం వైసిపి సీనియర్ నాయకులు గుంటి ప్రభువు ఆధ్వర్యంలో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను కలిసి మద్దతు తెలిపారు. సిఎం జగన్ ముస్లింలకు, మైనార్టీలకు, ఎస్‌సి, బిసిలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్‌ను, ఉమాబాలను గెలిపించుకుంటామని అన్నారు. దీనిపై ఉమాబాల మాట్లాడుతూ వైసిపిని గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు.

విమర్శలే ఎజెండా..సమస్యలు పక్కదారి..!

(మొదటి పేజీ నుంచి)

అప్పగించడం వంటి ఏఒక్క సమస్యపైనే నాయకులు మాట్లాడటం లేదు. జిల్లావ్యాప్తంగా రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేస్తారో, లేదో ప్రధాన పార్టీలు ఏఒక్కరూ చెప్పడం లేదు. రోడ్లపై ఒకరికొకరు విమర్శించుకోవడంతోనే సరిపెడుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతుల సమస్యపైనా ప్రధాన పార్టీలు మాట్లాడటం లేదు. దశాబ్దకాలంగా చింతలపూడి బాధిత రైతులు న్యాయమైన పరిహారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. రైతుల సమస్యపై ఏఒక్కరూ మాట్లాడటం లేదు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రస్తావన లేకుండానే ఎన్నికల ప్రచారం సాగుతోంది.

ప్రజలను ఏమార్చి.. డబ్బు వెదజల్లేందుకు యత్నాలు

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చీరలు, ఫోన్లు వంటి బహుమతులు పంపిణీ చేసి ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగించారు. నామినేషన్ల సమయంలో భోజనాల పేరుతో విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన సంగతి తెలిసిందే. ఎన్నికల ముందు రోజు ఓటుకు రూ.వెయ్యి, రూ.రెండు వేలు ఇచ్చి ఓట్లు పొందేందుకు చూస్తున్నారు. ప్రధాన పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆలోచించి ఓటు వేస్తేనే భవిష్యత్తులో మేలు జరుగుతోంది. లేకపోతే జనం సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడాల్సిన దుస్థితి కొనసాగనుంది.

చేపలవేట చూద్దామని వెళ్లి..

(మొదటి పేజీ నుంచి)

స్థానికులు అక్కడికి చేరుకుని ఎర్రకాల్వలో గాలించగా కొద్దిసేపటికి ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిషాద్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉండగా, రేష్మకు ఒక కుమార్తె ఉంది. ఆషాద్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

(మొదటి పేజీ నుంచి)

నామినేషన్లు దాఖలు చేయగా నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. ఇంకా 13 నామినేషన్లు మిగిలాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో 123 నామినేషన్లకుగాను పరిశీలన అనంతరం 26 నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో ఇంకా 97 నామినేషన్లు మిగిలాయి. తిరస్కరణకు గురైన నామినేషన్లలో ఎక్కువగా ప్రధాన పార్టీల తరపున డమ్మీ అభ్యర్థులుగా వేసినవి, కొన్ని పత్రాలు సమర్పించనవి ఉన్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులకు సంబంధించి ఏఒక్కరీ నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. 29వ తేదీ వరకూ విత్‌డ్రాల పర్వం సాగనుంది. అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుదిజాబితా విడుదల కానుంది.

'టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంఎల్ఎ బందారు మాధవనాయుడు అన్నారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి నాయకర్, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రూ.130 కోట్లతో భీమవరం అభివృద్ధి

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని 2019 నుంచి 2024 వరకు ఈ 58 నెలల కాలంలో సుమారు రూ.130 కోట్లతో అభివృద్ధి చేశామని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 1, 2, 4, 5 వార్డుల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో కూడా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. భీమవరం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న తనను మరోసారి అఖండ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

'టిడిపి కూటమిని గెలిపించాలి'

ప్రజాశక్తి - ఉండి

అర్హులందరికీ సూపర్ సిక్స్ పథకాలు అందాలంటే టిడిపి కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కనుమూరి రఘురామకృష్ణంరాజు సతీమణి కనుమూరి రమాదేవి, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని అన్నారు. టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఉండి గ్రామంలో వారు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘురామకృష్ణంరాజుకు ప్రతి ఒక్కరూ ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మల సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి సూర్యకుమారి కోరారు. ఉల్లంపర్రు గ్రామంలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు.

కేశవరంలో ధర్మరాజు ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కేశవరంలో జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి ధర్మరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు.

'వైసిపి హయాంలోనే ప్రజలకు మేలు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి పాలనలో ప్రజలందరికీ మేలు జరిగిందని, మరింత మేలు జరగడానికి వైసిపిని మరోసారి గెలిపించాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు కోరారు. మండలంలోని నెగ్గిపూడిలో, వనంపల్లిలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలన్నారు.

శ్రీరంగనాధరాజు తనయుడి ప్రచారం

పెనుగొండ : పెనుగొండలోని కంభాలవారివీధి, జవ్వాదివారివీధుల్లో శ్రీరంగనాధరాజు తనయుడు నరేష్‌రాజు ఎన్నికల ప్రచారం చేశారు. వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాలను, ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి శ్రీరంగనాధరాజును గెలిపించాలని కోరారు.

పది విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వెలగలేరు విద్యార్థి స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని స్కూల్ కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి, సుధారాణి తెలిపారు. 582 మార్కులతో మండలంలో ద్వితీయ, మార్టేరు టౌన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన పెనుమంట్ర లక్ష్మీనాగసహస్రకు రూ.పది వేలు, 580 మార్కులతో మండలంలో తృతీయ స్థానం, టౌన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన యళ్ల మోహనప్రియకు రూ.ఐదు వేలు, 577 మార్కులతో మండలంలో చతుర్థ స్థానం, టౌన్‌లో తృతీయ స్థానంలో నిలిచిన దొమ్మేటి అమృత వర్షిణికి రూ.ఐదు వేలు నగదు బహుమతులు అందించారు. ఏడుగురు విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారని, ఐదుగురు 550పైగా మార్కులు సాధించారని తెలిపారు. పరీక్ష రాసిన 20 మందిలో 20 మంది ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్యాసంస్థగా నిలిచిందని తెలిపారు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి, సుధారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులు

పట్టుదలతో విజయాలు సొంతం

వీరవాసరం : పట్టుదలతో విద్యనభ్యసిస్తే విజయాలు దానంతట అవే వరిస్తాయని ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను శుక్రవారం స్కూల్ యాజమాన్యం సత్కరించింది. 572 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం, స్కూల్ పరిధిలో ప్రథమ స్థానం సాధించిన మద్దాల జోత్స్న, 557 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన యళ్ల సాయిశ్రీజ్యోతి, 545 మార్కులతో తృతీయ స్థానం సాధించిన మల్లువల కీర్తిలను స్కూల్ యాజమాన్యం సత్కరించింది. అనంతరం మున్నలూరి వెంకట సత్యనారాయణ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శనివారపు ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, లక్ష్మీపార్వతి, పద్మజారాణి, పి.సుమిత, రవికుమార్ పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో శ్రీ సూర్య అఖండ విజయం

ప్రజాశక్తి - నరసాపురం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

ఇటీవల విడుదలైన జెఇఇ ఫలితాల్లో నరసాపురం శ్రీసూర్య కళాశాల విద్యార్థులు పట్టణంలోనే అత్యుత్తమ శాతంతో విజయకేతనం ఎగురవేశారని, ఐదుగురు విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తెలిపారు. గరిష్టంగా మ్యాథమెటిక్స్‌లో 99.36 శాతం, కెమిస్ట్రీలో 95.10 శాతం, ఫిజిక్స్‌లో 92.56 శాతం సాధించడం విశేషమన్నారు. పితాని విష్ణుమూర్తి 93.69 శాతం, అకి భావన 93.43 శాతం, సుందరపు ఇవాంజలిన్ 92.90 శాతం, నాగిడి మోహన్‌సాయి 85.56 శాతం, వేగి అక్షయ 69.75 శాతం, (రిజర్వ్ కేటగిరి)సాధించారని బ్రహ్మాజీ తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, సెక్రటరీ, కరెస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ పుష్పగుచ్ఛాలతో అభినందించారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ ఈ నెలలో జరిగే ఐఐటి ఎగ్జామ్‌కు ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ అవ్వాలని సూచించారు. ఈ అభినందనసభలో కళాశాల అకడమిక్ అడ్వైజర్ బోయి రామచంద్రారెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎఆర్ఎస్.కుమార్, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ జానకి రామ్, కడలి త్రిమూర్తులు, చౌదుల కరుణ్ కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి - నరసాపురం

జెఇఇ మెయిన్స్-2024 ఫలితాల్లో నరసాపురం ఆదిత్య కళాశాల విద్యార్థి మోకా బజిరి కేటగిరి విభాగంలో ఆలిండియా 567వ ర్యాంక్ సాధించాడని కళాశాల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరంలో మొత్తం 36 మంది విద్యార్థులు జెఇఇ మెయిన్ కోచింగ్ తీసుకోగా, అందులో 8 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. ఎనిమిది మందికి జెఇఇ (అడ్వాన్స్) ద్వారా ఐఐటి సీట్లు పొందే అవకాశం కలదని తెలిపారు. విద్యార్థులందరిని డైరెక్టర్ రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ శివకోటప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గాభవాని, అధ్యాపకులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నీటి నిల్వలు దోమలకు నిలయాలని, వారంలో ఒక రోజు పొడి వాతావరణం కలుగచేద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 31, 30, 32 వార్డుల్లో జరుగుతున్న డ్రై డే, కుటుంబ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో పెరుగుతున్న లార్వాను గుర్తించి వాటిని నిర్మూలించాలన్నారు. ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని, జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు రమణ, వెంకటలక్ష్మి, చంద్రకుమారి ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, భవాని, లక్ష్మి వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

గణపవరం : గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి అంటూ రోగాలు దరి చేరకుండా జాగ్రత్తలు పాటించాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. స్థానిక వేలంపేట వద్ద నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం అన్ని సచివాలయాల వద్ద డ్రై డే కార్యక్రమం నిర్వహించి స్థానికులకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో స్థానికులకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పి నున్న పాపా, ఎఎన్ఎం ప్రేమలీల, ఆరోగ్య కార్యకర్తలు ఎ.కృష్ణ, ఎం.యోహాన్ పాల్గొన్నారు.

శ్రీరంగనాధరాజుకు కాపు సంఘ నాయకుల మద్దతు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థికి చెరుకువాడ శ్రీరంగనాధరాజుకు పెనుగొండ మండలంలోని నక్కావారిపాలేనికి చెందిన పలువురు కాపు సంఘ నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం రాత్రి పెనుగొండలోని కార్యాలయంలో శ్రీరంగనాధరాజును వారు మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏడిద కోదండ చక్రపాణి, కొమ్మిరెడ్డి హిమదత్, గాజుల బులిపుల్లారావు, సుంకర నాగబాబు పాల్గొన్నారు.

పంట కాలువల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

ఈ నెలాఖరులోగా మంచినీటి చెరువులు పూర్తి స్థాయిలో నింపుకోవాలని ఎంపిడిఒ ఎం.భాస్కరరావు అన్నారు. మండలంలోని అన్నయ్యకోడు పంటకాలువలను, బ్రాంచి కాలువలను మండల, పంచాయతీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మోడి, కలవపూడి, పల్లెపాలెం, ప్రాతళ్లమెరక, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో పర్యటించి కాలువల స్థితిగతులను పరిశీలించారు. ఎంపిడిఒ ఎం.భాస్కరరావు, కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్, పంచాయతీ గ్రామ కార్యదర్శి బి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కళాశాలలో శ్రీనివాస రామానుజన్ వర్ధంతి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రసిద్ధిగాంచిన గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. స్థానిక బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశానికి చెందిన గొప్ప గణిత శాస్త్రవేత్త రామానుజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.మధు శాలిని, కె.మాధురి, జి.సాగర్, పి.ర్యూన్సీలక్ష్మి పాల్గొన్నారు.

మతసామరస్యం కోసమే కాంగ్రెస్ పర్యటనలు

మాజీ మంత్రి బాపిరాజు

ఆకివీడు : మత సామరస్యం కోసమే కాంగ్రెస్ అనేక పర్యటనలు జరిపిందని ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి బాపిరాజు అన్నారు. కాంగ్రెస్ బ్లాక్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఎస్.నాయుడు, ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు మండలంలోని అయిభీమవరంలో బాపిరాజు నివాసం వద్ద నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడారు. ఇండియా వేదిక అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి జెఎస్ఆర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, మండల కన్వీనర్ చింత ఆదిశేషు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కాళీపట్నం పడమరలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజుతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ ప్రచారంలో దొంగ నాగముని, సుబ్రహ్మణ్యం, కోడెల్లి వెంకటరావు పాల్గొన్నారు.

'ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలి'

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి లాజర్ అబ్బదాసరి మాదిగ పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా ఎన్‌డిఎ కూటమికి తణుకు నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ స్థానిక కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బదాసరి మాణిక్యం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో లాజర్ మాట్లాడారు. భావితరాల భవిష్యత్ ప్రధానిమంత్రి మోడి, చంద్రబాబునాయుడుతో సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దిద్దే మధుబాబు, తణుకు నియోజకవర్గ అధ్యక్షులు కళ్యాణ్ పాల్గొన్నారు.

'ఉచితాలు వద్దు..... అభివృద్ధి ముద్దు'

ఉండి : ఉచితాలు వద్దు అభివృద్ధి ముద్దు అని నేషనలిస్టు జనశక్తి పార్టీ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కడియం సూరిబాబు అన్నారు. శుక్రవారం నామినేషన్ పరిశీలన అనంతరం కడియం సూరిబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రంలో అభివృద్ధి ఊసే లేకుండా కేవలం ఉచితాలపైనే టిడిపి, జనసేన, వైసిపిలు ఆధారపడ్డాయన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఉచితాలు అందిస్తూ రాష్ట్రాన్ని సంక్షోభంలో పడేస్తున్నారన్నారు.

గోనె సంచులివ్వాలని ఆర్‌బికె వద్ద ఆందోళన

ప్రజాశక్తి - గణపవరం

రైతులకు గోనె సంచులు అందించాలని, తేమశాతం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కోరుతూ శుక్రవారం ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కేశవరం రైతుభరోసా కేంద్రం వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ పంట మాసూళ్ల ప్రారంభ దశలోనే గోనె సంచులను ప్రభుత్వం రైతులకు అందించలేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎండలు మండుతున్నా తేమశాతం పేరుతో మిల్లర్లు సాగిస్తున్న దోపిడీని అధికారులు అరికట్టలేకపోవడం దారుణమన్నారు. తక్షణం గోనె సంచులు అందించాలని, మిల్లర్ల మోసాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో రైతులు ధాన్యం పట్టుకునేందుకు మూడు రోజులుగా సంచుల కోసం రైతుభరోసా కేంద్రం చుట్టూ తిరుగుతున్నారన్నారు. సమస్యను స్థానిక ఎఒ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మాట్లాడుతూ వెంటనే సంచులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా ఆరిపోయాక ఆర్‌బికెకు తీసుకెళుతున్నామని, అక్కడ 16 పాయింట్లు వస్తే వరదరాజపురం, మొయ్యేరుల్లో రైస్‌మిల్లులు వద్ద అదనంగా నాలుగు పాయింట్లు ఎక్కువ చూపించి రూ.80 వసూలు చేయడం లేదా, ధాన్యం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు బి.ఎర్రినాయుడు, డి.త్రినాథ్, ఎస్.రంగబాబు, ఎస్.నాగేశ్వరరావు, ఎం.కృష్ణ, ఎం.ఈశ్వరరావు, పి.సోమలక్ష్మి, వై.లక్ష్మి పాల్గొన్నారు.

నినదిస్తున్న రైతులు, నేతలు

భారాల బిజెపిని, మద్దతు పార్టీలను ఓడించాలి

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేసిన బిజెపిని, దానికి మద్దతుగా ఉన్న పార్టీలను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. సిపిఎం తాడేపల్లిగూడెం నియోజకవర్గ విస్తృత సమావేశం శుక్రవారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఏఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న హామీని గాలికొదిలేసిందని, కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా ఉన్న పరిశ్రమలు మూసివేశారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి కొత్త చట్టాలు తెచ్చారన్నారు. ఈ కాలంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లుగా మార్చి హక్కులు హరించి వేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డి, కండెల్లి సోమరాజు, సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న బలరాం

అవన్నీ తప్పుడు ఆరోపణలు

టిడిపి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికల్లో ఎదుర్కోలేక వైసిపి నేతలు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని టిడిపి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై రిటైర్డ్ ఉద్యోగి ధర్మదాస్ చేసిన ఆరోపణలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద సరైన ఆధారాలు చూపించ లేకపోయారన్నారు. ఎటువంటి ఆధారాలూ లేకుండా ఫిర్యాదు చేసిన లాయర్ జి.రోనాల్డ్‌రాజు వైసిపి అభ్యర్థి కంభంపాటి విజయరాజు బంధువు అని తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో ఆధారాలు చూపించాలని రిటర్నింగ్ అధికారి అడిగితే చూపించలేకపోయారని, ఇదేమి రాజకీయమని ప్రశ్నించారు. తాను తన సొంత సొమ్ముతో రాజకీయాలు చేస్తున్నానని, వైసిపి అభ్యర్థి లంచాల సొమ్ముతో రాజకీయం చేస్తున్నారని రోషన్‌కుమార్ ఆరోపించారు. మరికొద్ది రోజుల్లో దానిని తాను నిరూపిస్తానని, తన వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని చెప్పారు. దళితుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం తగదని, ఇది మాల, మాదిగలకు మధ్య యుద్ధం అన్నట్లుగా విజయరాజు ప్రచారం చేయడం దారుణమని అన్నారు. టిడిపి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, ఆయన సతీమణి చేసిన సేవా కార్యక్రమాలు, వారికి ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారని న్యాయవాది డి.కోటేశ్వరరావు అన్నారు. రోషన్ విజయం సాధించడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి, జనసేన నాయకులు తూము విజయకుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సొంగా రోషన్‌కుమార్

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా శివ..!

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారుతున్నాయి. ఇక్కడ టిడిపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు, వైసిపి అభ్యర్థిగా పివిఎల్.నరసింహారాజు పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ ఎంఎల్ఎ శివరామరాజు మరో ట్విస్టు ఇచ్చారు. ఒక సెట్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా, మరో సెట్ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ విత్‌డ్రా చేసుకోనున్నట్లు సమాచారం. సింహం గుర్తుతో ఉండి బరిలోకి శివ దిగనున్నారు. సింహం సింబల్ కోసం ఆయన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

అధిక ఉష్ణోగ్రతల పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కార్మిక శాఖాధికారి లక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుత వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, యాజమాన్యం కూడా తగు రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కార్మిక శాఖాధికారి ఎ.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కార్మికులు, ఉద్యోగుల పని గంటలను రీషెడ్యూలింగ్ చేయాలని పేర్కొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు తగ్గేవరకు వైద్యఆరోగ్య శాఖాధికారులతో సమన్వయం చేసుకుని ఉద్యోగుల ఆరోగ్య సమస్యలను క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య బహిరంగ కార్మికుల పని షెడ్యూల్‌ను మార్పు చేయాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, కార్మికుల్లో డీహైడ్రేషన్‌ను నివారించే చర్యలకు సంబంధించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వేడి సంబంధిత వ్యాధుల నివారణకు పోస్టర్లను తప్పనిసరిగా ప్రాంగణంలో ప్రదర్శించాలని ఆదేశించారు.


కార్తికేయనిని సత్కరిస్తున్న కారుమూరి

మేటిగా పదో తరగతి ఫలితాలు

కార్తికేయని అభినందన కార్యక్రమంలో మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకురూరల్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన మౌలిక సౌకర్యాల ఫలితమే పదో తరగతి పరీక్షా ఫలితాలకు నిదర్శనమని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరరావు అన్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయం వద్ద తణుకు జాస్తి సీతామహాలక్ష్మీ బాలికల ఉన్నత పాఠశాల (గర్ల్స్ హైస్కూల్) విద్యార్థిని కొంపెల్ల శ్రీ సత్య కార్తికేయని రూ.581 మార్కులు సాధించిన సందర్భంగా మంత్రి కారుమూరి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ 600 మార్కులకుగాను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 581 మార్కులు సాధించిందంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధంగా విద్యాబోధన జరుగుతుందో గమనించాలని సూచించారు. తండ్రి లేని కార్తికేయని భవిష్యత్తులో ఏం చదవాలన్నా తాను అండగా నిలుస్తానని కారుమూరి హామీ ఇచ్చారు. విద్యార్థినిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ ఛైర్మన్ కత్తుల జస్పాల్, గంజి సతీష్ పాల్గొన్నారు.

నరసాపురం పార్లమెంట్ బరిలో 21 మంది అభ్యర్థులు

ఆరు నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నరసాపురం పార్లమెంటు స్థానానికి నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయ్యింది. స్థానిక కలెక్టరేట్లో నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎం.దీప సమక్షంలో నిర్వహించారు. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ నెల 25వ తేదీతో ముగిసింది. ఆ సమయానికి 27 మంది అభ్యర్థులు 39 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్లను శుక్రవారం పరిశీలించిన అనంతరం 21 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ధ్రువీకరించారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు అభ్యర్థులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుదారులుగా నామినేషన్లు వేశారు. మరో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ పత్రాలు దాఖలులో పది మంది ప్రతిపాదికుల మద్దతు సంతకాలు లేకపోవడం, ఒక అభ్యర్థి ఫారం-ఎ, బి, అఫిడవిట్ సమర్పించకపోవడంతో తిరస్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ప్రకటించారు.

అత్యధిక ధర పలికిన వర్జీనియా పొగాకు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం వేలం కేంద్రంలో నిర్వహించిన వర్జీనియా పొగాకు కొనుగోళ్లలో శుక్రవారం కిలో రూ.311 పలికింది. ఈ విధంగా ధర పలకడం ఇదే రికార్డు అని అధికారులు అన్నారు. వేలం నిర్వహణాధికారి, గ్రేసీ మార్గరెట్ మాట్లాడుతూ అంతర్జాతీయ పొగాకు నాణ్యతకు, స్థానికంగా ఉత్పత్తి అయిన ఎన్ఎలఎస్ పరిధిలోని వర్జీనియా పొగాకు అనుగుణంగా ఉండటంతో ధర పెరిగిందని తెలిపారు.

మనస్విని అభినందిస్తున్న ఎస్‌పి

టెన్త్ ఫస్టు ర్యాంకర్ మనస్వికి ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన మనస్వికి జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రత్యేక అభినందనలు తెలిపారు. 600 మార్కులకుగాను 599 మార్కులు సాధించిన ఆకుల నాగ వెంకట సాయి మనస్విని ఎస్‌పి తన ఛాంబర్‌లో అభినందించి ప్రశంసాపత్రం, రూ.ఐదు వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో మనస్వి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులు హక్కులను వినియోగించుకోవాలి

రిటైర్డ్ న్యాయమూర్తి అడబాల లక్ష్మీ

ప్రజాశక్తి - తణుకురూరల్

రాజ్యాంగం కల్పించిన హక్కులను విద్యార్థినులు వినియోగించుకుంటూ బాధ్యతతో మెలగాలని ఏలూరుకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి అడబాల లక్ష్మీ సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో విద్యార్థి సంఘం వారు తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు ఆర్థిక స్వావలంబన కల్గి ఉండాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ సమాజానికి, కుటుంబానికి తమవంతు సాయం అందించాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినులు కేవలం ఉన్నత విద్యను అభ్యసించడమే కాకుండా తమను తాము రక్షించుకునే ఆత్మ విశ్వాసం, ధైర్యం కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్లు, జర్నలిజం సర్టిఫికెట్లు విద్యార్థినులకు అందజేశారు. 2024 రిపబ్లిక్ డే పెరేడ్‌లో ప్రాతినిధ్యం వహించిన ఇ.గీతికదేవిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. రిటైర్డ్ న్యాయమూర్తి అడబాల లక్ష్మీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ యుఎల్.సుందరీబాయి, సంకు మనోరమ, విద్యార్థి యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.